డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఎక్కడికక్కడే మురుగు గుంటలు
- విఘ్నేశ్వరకాలనీలో మట్టిరోడ్లే దిక్కు

వార్డు : 10వ
జనాభా : 5,640
ప్రధాన వీధులు: క్రిస్టియన్‌పల్లి, శ్రీరామకాలనీ, మారుతీ శ్రీనగర్, రత్నప్రభాకర్‌రెడ్డి కాలనీ, అయోధ్యనగర్, వైష్ణోదేవీ కాలనీ, బంజారా కాలనీ, ఆదర్శనగర్, శాంతినగర్, మర్లు (కొంత భాగం), ఎస్‌ఆర్‌నగర్, విఘ్నేశ్వరకాలనీ.


శ్రీరామకాలనీలోని మట్టిరోడ్డు


శాంతినగర్‌లో ఏర్పడిన మురుగు గుంట

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పదో వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆయా కాలనీల్లో చాలా చోట్ల సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వార్డు మొత్తం ఒకప్పుడు క్రిస్టియన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉండేది. 2012లో మున్సిపాలిటీలో విలీనమైనప్పటికీ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి శ్రీరామకాలనీ 1992లో ఏర్పాటైంది. దాదాపు 500 ఇళ్లు, వెయ్యికి పైగా జనాభా ఉంటుంది. మట్టిరోడ్లే తప్పా ఎక్కడా సీసీ గానీ మురుగు కాల్వలు నిర్మించ లేదు. ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండటంతో దోమలు స్వైర్వవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలోనే మున్సిపల్ అనుమతి కోసం డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తున్నా ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదంటున్నారు. ఇక మర్లులోని విఘ్నేశ్వరకాలనీ, శాంతినగర్ (కొంత భాగం)లో ఎక్కడ చూసినా 10 లేదా 15 ఫీట్ల మట్టిరోడ్లే కనిపిస్తున్నాయి. ప్రధాన రోడ్డు నుంచి ఏ గల్లీలోకైనా బైక్‌లు, ఆటోలు తప్పా ఇతర పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడే మురుగు ఏరులై పారుతూ పలుచోట్ల గుంటలుగా నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. శాంతినగర్ వీధి నంబర్–3 ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని రెండు ఓపెన్ ప్లాట్లు పెద్ద మురుగు గుంట మడుగును తలపిస్తుంది. చుట్టుపక్కల ఇళ్ల నుంచి మురుగు అక్కడి వరకు వచ్చి ఆగిపోతోంది. పక్కనే కాంపౌండ్‌వాల్‌తో కలిగిన ప్లాటు యజమానులు అండర్‌గ్రౌండ్ పైపులైన్ వేసేందుకు నిరాకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆదర్శకాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య పందు లు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. బంజారాకాలనీ నుంచి నాలుగు విద్యుత్ స్తంభాలతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అక్కడివారు కోరుతున్నారు. అయోధ్యనగర్, క్రిస్టియన్‌పల్లిలోని సీసీరోడ్లు చాలావరకు దెబ్బతిన్నాయి. క్రీస్తుజ్యోతి ఉన్నత పాఠశాల వెనుక భాగంలో గత ఏడాది రెండు కొత్త కాలనీలు వెలిశాయి. ఎలాంటి సౌకర్యాలు లేవు.


విఘ్నేశ్వరకాలనీలో డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్య పారుతున్న మురుగు


ఇళ్ల మధ్య వేసిన చెత్తలో సంచరిస్తున్న పందులు

అన్నీ మట్టిరోడ్లే..



మా కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేవు. మట్టి రోడ్లే కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని గతంలోనే కౌన్సిలర్‌కు విజ్ఞప్తి చేశాం. అలాగే రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం తక్షణమే తొలగించాలి. పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

– కె.రవి, ఆటోడ్రైవర్, శాంతినగర్

కనీస సౌకర్యాలు కరువు..



కాలనీ ఏర్పడి 30ఏళ్లు దాటింది. డీటీసీపీ లే–అవుట్ ప్రకారం అప్పట్లోనే కనీసం 30నుంచి 40ఫీట్ల రోడ్డు వదిలినా ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదు. అన్నీ మట్టిరోడ్లే. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఇంటింటికీ చందాలు వేసుకుని గతంలో గుంతలు పడినచోట మొరం వేయించాం.

– విజయభాస్కర్, కోశాధికారి, శ్రీరామకాలనీ సంక్షేమ సంఘం

దశల వారీగా పరిష్కరిస్తాం..



వార్డులో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తాం. అప్పట్లో క్రిస్టియన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉండటంతో చాలా గల్లీలలో సీసీరోడ్లు, మురుగు వెళ్లేందుకు కాల్వలు లేనిది వాస్తవమే. ఆయా కాలనీల్లో కనీస సౌకర్యాలను కల్పించేందుకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఎం.రాణి, పదో వార్డు కౌన్సిలర్

క్లుప్తంగా

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించండి



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు నిరసన ఆగదని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం గార్లపహాడ్ గేటు వద్ద ఏర్పాటు చేసిన రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని, లేదంటే ఈ నిరసన కార్యక్రమాలను ఆపేదిలేదన్నారు. కోయిల్‌కొండ అతిపెద్ద మండలంగా 44గ్రామ పంచాయతీలతో మరో మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటిస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రవి, రాంపూర్, గార్లపహాడ్ గ్రామాల ప్రజలు రిలే దీక్షకు మద్దతు తెలిపారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ బహూకరణ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర దివ్యాంగుల సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్సింహా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహక బహుమతులు దివ్యాంగులకు వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్‌యాదవ్, నాయకులు లక్ష్మయ్యగౌడ్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

హబీబ్‌నగర్‌లో పైపులైన్ లీకేజీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 26వ వార్డు పరిధిలోని హబీబ్‌నగర్‌లో అక్బరీ మజీద్‌కు వెళ్లే దారిన మిషన్ భగీరథ పైపులైన్‌కు రెండుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని రోజులుగా తాగునీరు నడిరోడ్డుపై ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే తాగునీటిని వృథా చేయొద్దని సూచిస్తున్న మున్సిపల్ అధికారులు ఈ లీకేజీలను సరిచేయకపోవడం గమనార్హం. మరోవైపు రోజు విడిచి రోజు కేవలం అరగంట మాత్రమే తాగునీరు వదులుతుండటంతో సరిపోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై వార్డు కౌన్సిలర్ ముష్కాన్ సుల్తానాను వివరణ కోరగా, త్వరలోనే లీకేజీలను సరిచేసి తాగునీరు వృథా కాకుండా చూస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గండేడ్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పెంట్యానాయక్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, మల్లయ్య, ప్రకాష్‌రావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఢిల్లీలో ధర్నాను విజయవంతం చేయండి

భూత్పూర్: కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు కిల్లెగోపాల్ తెలిపారు. ఆదివారం భూత్పూర్ చౌరస్తాలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిల్లెగోపాల్ మాట్లాడుతూ సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై ధర్నా చేపడుతున్నామని తెలిపారు. కనీస వేతనం రూ.26వేలు, నాలుగు లేబర్‌కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు, గ్రామీణ ఉపాధి కూలీలకు రూ.600ల కనీస రోజువారి కూలీ, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై కేంద్రం సుంకం తగ్గించాలని ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి, నాయకులు నారాయణ, నరసింహా, వెంకటయ్య, పెద్ద నర్సింహా, మాసమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.



ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

హన్వాడ: ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద 74మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ త్వరలోనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మండలానికి సాగునీరు వస్తున్నట్లు వివరించారు. చెరువులు, కుంటల్లో నీటిని నింపి బీడు భూములను సస్యశ్యామలం చేయనున్నామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వైద్యుల ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ఎల్‌ఓసీలు అందజేస్తున్నట్లు వివరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో రహదారుల అభివృద్ధి, బైపాస్‌తో పాటు, హన్వాడ మండలానికి కూడా కొత్త బైపాస్ రహదారి రానుందని, ఐటీ పార్కు, ఫుడ్ పార్కు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రానుందని వెల్లడించారు. అనంతరం నాయినోనిపల్లిలో రూ.20లక్షలతో, ఇబ్రహీంబాద్‌లో 25లక్షలతో సీసీరోడ్లు, తిరుమలగిరిలో రూ.15లక్షలతో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలుగు ఉపాధ్యాయురాలిగా 12ఏళ్లుగా సేవలు అందిస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన కవితకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉగాది పురస్కారం లభించింది. శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీచర్స్ కాలనీలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సం నిర్వహించారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయానికి ఆదివారం పెద్దఎత్తున జనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల మొక్కులు, పూజలు తదితర వాటితో ఆలయ ఆవరణ అడవి మొత్తం జనంతో నిండిపోయింది.

కందూర్‌లో భక్తుల సందడి


కందూరులోని కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత వారం రోజులుగా జాతర కొనసాగుతోంది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కోనేరులో స్నానలు చేసిన భక్తులు ప్రధాన ఆలయంలోని శివ లింగాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని కల్పవృక్షం చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. ఆలయ పరిసరాల్లో నెలకొన్న దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.


కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కార్యకర్తలకు అండగా ఉంటాం


గుడిబండలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు అండగా ఉంటానని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సంకరి కృష్ణయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం ఉండటంతో బీమా ద్వారా రూ.2లక్షల చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. రూ.2లక్షల చెక్కును కుటంబ సభ్యులకు అందజేసి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పార్టీ కోసం పని చేసే వారిని ఆదుకునేందుకు తనవంతు సాయం అందజేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు మరణించే కార్యకర్తలను ఆదుకోవడానికే సభ్యత్వం పొందిన వారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు సమయంలో కార్యకర్తలు తప్పకుండా సభ్యత్వం పొందాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయన్నగౌడ్, భాస్కర్‌నాయుడు, ఆంజనేయులు, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, నరేందర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

సేవలకు పురస్కారాలు అందజేత


పురస్కారం అందుకున్న వారితో ఫౌండేషన్ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీకరి ఫౌండేషన్ పాలమూరు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం టీచర్స్‌కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాది పండుగను పురస్కరించుకొని పలు రంగాలకు చెందిన వారికి సేవా పురస్కారాలతో సత్కరించారు. శ్రీకరి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మెట్టుకాడి శ్యాంసుందర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు, కవులు, సఫాయి కర్మచారులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులు తదితరులను సేవా పురస్కారాలతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మనోహర్ రెడ్డి, డాక్టర్ ప్రణీత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు సాహితి, లుంబిని పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో శ్రీశోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహిచిన ఉగాది కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా సాహిత్యపరంగా ముందు వరుసలో ఉందన్నారు. సమాజాన్ని సంస్కరింపజేసేదే కవిత్వమని, అలాంటి కవిత్వమే సమాజంలో నిలుస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు మృగ్యమైపోతున్నాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. ప్రధాన వక్త, ప్రముఖ పరిశోధకులు డాక్టర్ భాస్కరయోగి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారిగా 16ఏళ్లుగా ఉగాది కవి సమ్మేళనం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సమాజం కోసం రాసిన కవిత్వమే నిలుస్తుందన్నారు. అనంతరం కవులు వల్లభాపురం జనార్దన, పులి జమునలకు శ్రీశోభకృత్ ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో లుంబిని స్కూల్ డైరెక్టర్ కె.లక్ష్మణ్‌గౌడ్, పాలమూరు సాహితి అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, మార్కెట్ చైర్మన్ రహెమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కొండయ్య, ఎస్.విజయ్‌కుమార్, జగపతిరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోటకదిరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ మల్లు రమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మునీర్, మన్యంకొండ పాలక మండలి మాజీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు నర్సిములు, ఖదీర్, ఇమ్రాన్, మహమూద్ పాల్గొన్నారు.

జైలులో ఆకుకూరల సాగు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జైలులో కొన్ని రోజులుగా ఆకుకూరలు పండిస్తున్నారు. జైలు సూపరింటెండెంట్ వెంకటేశం ఆలోచన మేరకు జైలు ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు పండిస్తున్నారు. ప్రధానంగా పాలకూర, కొత్తిమీర, మెంతీకూర, పచ్చిమిర్చి వంటి వాటిని పండించి పక్కనే ఉన్న పెట్రోల్ బంకులో విక్రయిస్తున్నారు. ఆకుకూరల నిర్వహణను ప్రత్యేకంగా సూపరింటెండెంట్ పర్యవేక్షించడంతో పాటు ఖైదీల ద్వారా సాగు చేయిస్తున్నారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్‌లో సింధూజ(4) అనే చిన్నారి అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం బాలిక అంత్యక్రియలకు ఎంపీటీసీ నవనీత్‌రావు రూ.5వేలు మృతురాలి తండ్రి మహేష్‌కు అందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

జడ్చర్ల టౌన్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో మండలంలోని గంగాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ కేశవ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ జాతీయ కరాటే పోటీల్లో మాస్టర్ కేశవ్ అకాడమీకి చెందిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు, రెండు వెండి, ఒక కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. కటాస్ స్పైరింగ్ విభాగంలో భూమిక, నవ్యశ్రీ, సింధు, స్ఫూర్తి బంగారు పతకాలు, అఖిల, అమ్ములు వెండి పతకాలు, శ్రీలత కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను మాస్టర్ కేవశ్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థికి పతకం..

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 2వ జాతీయస్థాయి కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ఆలియా ప్రతిభ కనబరిచినట్లు టీఎస్ఎస్ ఎస్‌కేఏ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ చెన్నయ్య తెలిపారు. ఈ పోటీల్లో ఆలియా అండర్–17 విభాగం కటాస్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన బంగారు పతకం సాధించినట్లు తెలిపారు.


ఆలియాకు సర్టిఫికెట్ అందజేస్తున్న మాస్టర్లు

ఉపాధిహామీ పనులపై ఆడిట్

బాలానగర్: మండలంలో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్‌ను ఆదివారం ప్రారంభించారు. మండలంలో 37గ్రామాలకు గాను ముందుగా 16 గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై 18మంది డీఆర్‌పీలతో సోషల్ ఆడిట్ చేపట్టారు. మోతీఘణాపూర్, సూరారం, పలుగుమీది తండా, ఎడుగుట్టల తండా, బోడజానంపేట్, నమ్యతండా, గుండేడ్, బోడగుట్ట తండా, కేతిరెడ్డిపల్లి, జాలుగడ్డ తండా, మన్నెగూడతండా, ఊటకుంట తండా–3, చెన్నగులగడ్డ తండా, ఈదమ్మగడ్డ తండా, మాచారం తదితర గ్రామాల్లో ఆదివారం డీఆర్‌పీ బృందం ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణారావు, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పరీక్షల రద్దుతో అభ్యర్థులకు అన్యాయం

జడ్చర్ల: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక నేతాజీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు మినాజ్, వెంకటేశ్, వంశీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి, నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, గౌస్, సాయిలు, సంపత్, రాజీరెడ్డి, జంగయ్య, వెంకటయ్య, శివ, ఆదాం, రామ్‌గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.